





సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 23-9-2024

సంపుటి: 20 సంచిక: 154
పేజీలు: 4 వెల: రూ.1






# దసరా నుంచి 'కొత్త' సరదా!

- బుధవారం గెజిట్ నోటిఫికేషన్
- శ్రీశయన రిజర్వేషన్‌పై రాని క్లారిటీ
- సిండికేట్ అయ్యేందుకు రంగం సిద్ధం
- లిక్కర్ మాల్స్‌పైనే ఆశలు
- రేట్లు తగ్గుతాయని అర్రులు

2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.1027 కోట్లు, 2020-21లో రూ.1,080 కోట్లు, 2021-22లో రూ.1345 కోట్లు, 2022-23లో రూ.1421కోట్లులో 2023-24 రూ.1510 కోట్లు ఆదాయం సమకూరింది.

2014-19 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన ఆదాయాన్ని మించి గడిచిన ఐదేళ్లలో ఆదాయం వచ్చింది. పెద్ద మొత్తంలో ధరలను పెంచడం వల్ల మద్యం తాగేవారి సంఖ్య తగ్గినా గణనీయమైన ఆదాయం గత ప్రభుత్వానికి సమకూరింది.

**సత్యంన్యూస్, శ్రీకాకుళం**

వచ్చే నెల 3 నుంచి దసరా నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 1 నుంచి కొత్త మద్యం పాలసీ అమలులోకి వస్తుంది. వెంటనే షాపులు దొరకవు కాబట్టి నవరాత్రులు ప్రారంభమైన 3వ తేదీ నుంచి ప్రైవేటు వ్యాపారస్తులు మద్యం విక్రయాలకు ముహూర్తం ఫిక్స్ చేసుకున్నారు. మరోవైపు ఈసారి లిక్కర్ రేట్లు తగ్గుతాయని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుండటంతో అటు లిక్కర్ వ్యాపారులకు, ఇటు మద్యం ప్రియులకు కొత్త సరదాను తెస్తుందనడంలో సందేహం లేదు.

రాష్ట్రంలో కొత్త లిక్కర్ పాలసీకి సంబంధించిన గెజిట్ బుధవారం విడుదల కానుంది. ఇందులో జిల్లాలో శ్రీశయనులకు, సొండి కులస్తులకు 10శాతం షాపులు కేటాయిస్తామన్న అంశం ప్రస్తావించారా, లేదా అన్నది తేలాల్సి ఉంది. గెజిట్‌లో వీటిని రిజర్వ్‌గా చూపించి, ఆ తర్వాత 10 శాతం షాపుల కోసం అప్లికేషన్లు తీసుకుంటారని ప్రాథమికంగా తెలుస్తుంది. 2017లో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు గెజిట్‌లో పేర్కొన్న షాపుల సంఖ్యకు ఇప్పుడు దరఖాస్తులు స్వీకరించనున్నారు. జిల్లా విభజన కావడంతో 180 షాపులకు దరఖాస్తులు తీసుకోవాల్సి ఉంది. అయితే ఇందులో 17 శ్రీశయనులకు, రెండు సొండి కులస్తులకు రిజర్వ్ చేయాలి. మిగిలిన 161 జనరల్ కేటగిరీలో దరఖాస్తులు తీసుకుంటారు. ఇందుకోసం నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుము రూ.2 లక్షలుగా నిర్ణయించారు. ఆరు రాష్ట్రాల్లో అధ్యయనం చేసి రాష్ట్రంలో కొత్త ఎక్సైజ్ పాలసీని తీసుకొస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినా తెలంగాణ ఎక్సైజ్ పాలసీని మక్కీకి మక్కీ కాపీ కొట్టేశారు. అక్కడి మాదిరిగానే 10వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో ఏడాదికి ఒక షాపునకు రూ.50 లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయించారు. 10 వేలు దాటి 50 వేలు లోపు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 50వేలు దాటి 5 లక్షల లోపు జనాభా ఉంటే రూ.65 లక్షలుగా నిర్ణయించారు. అంటే శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏడాదికి రూ.65 లక్షలు లైసెన్స్ ఫీజును చెల్లించాలి. పాలసీ రెండేళ్ల కాలపరిమితికి తెస్తున్నారు కాబట్టి రెండో ఏడాది 10 శాతం పెంచి ప్రభుత్వానికి చెల్లించాలి. అంటే, శ్రీకాకుళం నగర కార్పొరేషన్‌లో మొదటి ఏడాది రూ.65 లక్షలు, రెండో ఏడాది రూ.72.5 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో 20 శాతం కమీషన్ ఇస్తామని గెజిట్‌లో పేర్కొనబోతున్నారు. ఇది ఇన్‌కమ్ టాక్స్ మినహాయించా? కలుపుకొనా అనేది గెజిట్ వస్తేగానీ తెలియదు. దీంతో పాటు ఏయే ప్రాంతాల్లో ఎక్కడెక్కడ షాపులకు దరఖాస్తు చేసుకోవాలో కూడా గెజిట్‌లో పేర్కొనున్నారు. గెజిట్ వచ్చిన వారం లోపే దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ నెల 29న దరఖాస్తులు స్వీకరించడానికి చివరి తేదీగా నిర్ణయించి 31వ తేదీలోపు డ్రా నిర్వహించి షాపులు కేటాయించేస్తారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో గార, ఆమదాలవలస నియోజకవర్గంలో


- మిగతా 4లో

## పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



**(సత్యంన్యూస్, నరసన్నపేట)**

పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికుల ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సేవలు వెలకట్టలేనివని అన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులను పారిశుధ్య కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో నియోజవర్గ జనసేన ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్‌కుమార్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనుబాబు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సంతోష్, ఎంపీడీవో మధుసూదనరావు, మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గొద్దు చిట్టిబాబు, జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి రోణంకి కృష్ణంనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు కింజరాపు రామారావు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, మాజీ సర్పంచ్ ఊణ్ణ రాజశ్రీ, పీస కృష్ణ, వార్డు సభ్యులు బి.సంతోషి, గొలివి రామారావు, బోయిన సతీష్, సరిపల్లి మధు, చలపాక మల్లి, బెవర శివ, కూటమి నాయకులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.




# బాబుతో అట్లుంటది మరి!

- యానిమల్ ఫ్యాట్ ఉందని కచ్చితంగా చెప్పని ల్యాబ్ రిపోర్టు
- మతపరమైన వ్యాఖ్యల దుమారం బాబుకిది మొదటిసారి కాదు
- ఎలాంటి ఆధారాలు లేకుండానే ముఖ్యమంత్రి ఆరోపణలు
- నిష్పక్షపాత విచారణ కోసం ప్రపంచవ్యాప్త భక్తుల ఆందోళన



- ఒక రసాయనమైన 'ఎస్' విలువ ఉన్నదానికంటే పెరిగితే విదేశీ కొవ్వులకు స్థానం ఉంటుందని, చేప నూనె, పశు కొవ్వు చేరవచ్చని ఆందోళన చెందింది. కాని, వాటిని ప్రసాదంలో గమనించినట్టు ఎక్కడా లేదు. ఉండడానికి అవకాశం ఉంటుంది అని అన్నదే తప్ప, జంతువుల కొవ్వు ఉందని ఎక్కడా చెప్పలేదు.
- ఇన్నాళ్లూ వెజిటబుల్ కొవ్వుల గురించే ఆందోళన ఉండేది. కాని మొదటిసారి చంద్రబాబు లడ్డు తయారీలో జంతువుల కొవ్వు ప్రస్తావించి ఆలయ అధికారులను నిశ్చేష్టపరిచారు.
- ఈ దేశంలో హిందువులను క్రిస్టియన్లుగా మతం మార్చడానికి వాటికన్ సిటీలో పోప్‌నుంచి సోనియా గాంధీ కొన్ని రహస్య సందేశాలు అందుకున్నారని, ఆ బాధ్యతను క్రైస్తవ మతానికి చెందిన వైఎస్ రాజశేఖర రెడ్డికి అప్పజెప్పారని వదంతులు లేవనెత్తారు. అక్కడితో ఆగకుండా తిరుమల తిరుపతికి చెందిన ఏడు కొండలలో మూడింటిని వివిధ చర్చిలకు ధారాదత్తం చేస్తున్నట్టు పుకార్లు లేవదీశారు.
- "నా ఆరాధ్య దైవం వెంకటేశ్వర స్వామి. నీ ఆరాధ్య దైవం జీసస్ క్రైస్ట్. నువ్వు ఎన్నికలలో గెలిస్తే జెరూసలెం వెళ్తావు, అదే నేను తెలిస్తే తిరుపతి వెళ్తాను. నీతో ఎప్పుడూ బైబిల్ ఉంటుంది. అందులో తప్పేమీ లేకపోవచ్చు. కానీ, హిందూ దేవాలయాల మీద దాడులు జరిగినప్పుడు మాత్రం నేను ఉపేక్షించేది లేదు" అంటూ విరుచుకుపడ్డారు.

**(పవన్ కోరాడ)**

పవిత్ర తిరుమల ఆలయంలో ప్రసాదంగా ఇచ్చే లడ్డులో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసిన ఆరోపణ పెద్ద దుమారానికి తెరతీసింది. వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ కల్తీ జరిగిందంటూ ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి మాటల యుద్ధం మొదలుపెట్టారు. ఈ వివాదపు అగ్గిని రాజేసుకుని హిందూత్వవాదులు భావోద్వేగపరమైన ఉద్యమాన్ని సోషల్ మీడియాలో ఇప్పటికే మొదలుపెట్టారు. ఈ హేట్రెడ్ ఉద్యమం రాష్ట్ర సరిహద్దులు దాటి ఇప్పుడు యావత్ ప్రపంచాన్ని చుట్టేసింది. తాము అధికారంలోకి వచ్చిన వందరోజుల సందర్భంలో జరుపుకొంటున్న సంబరాల్లో చంద్రబాబు నాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు. బాబు వ్యాఖ్యలపట్ల వివిధ మత సంస్థల అధిపతుల నుంచి, రాజకీయ పార్టీల నుంచి ఆలయ ఉన్నతాధికారుల వరకూ గట్టి ప్రతిస్పందన వస్తోంది. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని బిజెపి, కాంగ్రెస్ పార్టీలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా రాజకీయ లబ్ధి పొందడానికి బాబు ఈ వ్యాఖ్యలు చేసారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది.

### లాబ్ నివేదికలు

గుజరాత్ రాష్ట్రంలోని ఆనంద్‌లో ఉన్న నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు వెలువర్చిన ఒక నివేదిక ఈ వివాదానికి కారణమైంది. తిరుపతి లడ్డులో జంతువుల కొవ్వు ఉందని సోషల్ మీడియాలో ప్రచారం అవుతోన్న నివేదిక భక్తుల నమ్మకానికి సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో వేగంగా వైరల్ అయింది. లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో కల్తీకి అవకాశముందని ఆ నివేదికలో ఉంది. **ఒక రసాయనమైన 'ఎస్' విలువ ఉన్నదానికంటే పెరిగితే విదేశీ కొవ్వులకు స్థానం ఉంటుందని, చేప నూనె, పశు కొవ్వు చేరవచ్చని ఆందోళన చెందింది. కాని, వాటిని ప్రసాదంలో గమనించినట్టు ఎక్కడా లేదు. ఉండడానికి అవకాశం ఉంటుంది అని అన్నదే తప్ప, జంతువుల కొవ్వు ఉందని ఎక్కడా చెప్పలేదు.** బాబు వ్యాఖ్యలపై వైకాపా నాయకులు విరుచుకుపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన మొదటిరోజు నుంచీ ప్రతి విషయంలోనూ గత ఐదేళ్లలో ఘోర వైఫల్యం జరిగిందనే మాటల వాడడం పరిపాటి అయింది. ప్రధాని నరేంద్ర మోదీతో ఎన్నికల పొత్తు కుదుర్చుకున్న తర్వాత ఆయన దగ్గర నుంచి చంద్రబాబు గత పాలకులను విమర్శించడం నేర్చుకున్నారనిపిస్తోంది. ఎన్నికల ప్రచారంలో కూడా జగన్ మిగిలిన హిందువుల కంటే క్రిస్టియన్లకు ఎక్కువ ఫేవర్ చేస్తున్నారని దుమారం రేపుతునే ఉన్నారు. అయితే ఇప్పుడు చేసిన ఆరోపణ పూర్తిగా జగన్మోహన్ రెడ్డిని అణగదొక్కడానికి చేసింది. ఆయన క్రిస్టియన్ కాబట్టే ఇలాంటి దురాగతానికి పాల్పడ్డాడని దేశవ్యాప్తంగా చర్చ జరగడానికి తావిచ్చే వీలుంది.



### కల్తీల చరిత్ర

అయితే తిరుపతి లడ్డూలలో కల్తీ గురించి దుమారం రేగడం ఇది తొలిసారి కాదు. ఇంతకుముందు ఒక రకమైన డాల్డా బ్రాండ్‌లో వనస్పతి అనే శాకాహార కొవ్వు ఉందని వివాదం చెలరేగింది. టిటిడి అధికారులు ఈ వెజిటబుల్ ఫాట్ ఉందని తేలిన తర్వాత ఆ నెయ్యి సరఫరా చేసిన కంపెనీని బ్లాక్‌లిస్టులో పెట్టారు. ఇదివరలో ఒక సంస్థ సరఫరా చేసిన 68వేల కిలోల నెయ్యిలో 20వేల కిలోలు నాణ్యత తక్కువగా ఉందని దానిని వెనక్కి తిప్పి పంపడమే కాదు, దానిని కూడా బ్లాక్‌లిస్ట్ పెట్టినట్టు ఆలయ నిర్వహణ అధికారి జె.శ్యామల రావు తెలిపారు. అయితే **ఇన్నాళ్లూ వెజిటబుల్ కొవ్వుల గురించే ఆందోళన ఉండేది. కాని మొదటిసారి చంద్రబాబు లడ్డు తయారీలో జంతువుల కొవ్వు ప్రస్తావించి ఆలయ అధికారులను నిశ్చేష్టపరిచారు.**

చంద్రబాబు నాయుడుకు కప్పదాటు రాజకీయాల గురించి అందరికీ తెలిసిందే. రాజకీయాలలో లబ్ధి కోసం లడ్డు తయారీలో జంతువుల కొవ్వు ప్రస్తావించి ఆలయ అధికారులను నిశ్చేష్టపరిచారు. అవసరానికి అనుగుణంగా నాలుకను ఎటు పడితే అటు తిప్పడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని దేశంలో ఉన్న అందరు రాజకీయ నాయకులకూ తెలిసిందే. 1999 ఎన్నికలలో ఎన్‌డిఏతో జట్టుకట్టి కార్గిల్ వార్ నేపథ్యాన్ని తనకు అనుకూలంగా వాడదలచుకున్నారు. అప్పుడు ఆ పాచిక పారలేదు. మరో ఎన్నికలలో ఎన్‌డీఏ కటీఫ్ చెప్పారు. రాహుల్‌గాంధీతో రాసుకుపూసుకు తిరగడమే కాక, నరేంద్ర మోదీని నోటికి వచ్చినట్టు తాను తిట్టడమే కాకుండా, ఇతరులతో తిట్టించడానికి కొత్తఢిల్లీలో ఒక రోజంతా కార్యక్రమం పెట్టించి, జాతీయ మీడియా అటెన్షన్ పొందారు. అయినా అలాంటివేమీ పట్టించుకోకుండా, 2024 ఎన్నికలలో ఎన్డీయేతో జట్టుకట్టారు. గెలవడం కోసం దేనికైనా తెగిస్తారనే గొప్ప చరిత్ర గల చంద్రబాబు సరిగ్గా 100 రోజుల పాలన పూర్తయిన రోజునే ఈ వివాదాస్పద వ్యాఖ్యను ఎంచుకోవడానికి కారణాలు మనం అన్వేషించాలి. ఈ విషయమై 'ది వైర్'తో తెలంగాణ కాంగ్రెస్ జాతీయ సమన్వయకర్త శ్రీధర్ రామస్వామి మాట్లాడుతూ 2004 నుంచి 2009 మధ్య తొలిసారి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఇదే తరహాలో చంద్రబాబు చేసిన దుష్ప్రచారాన్ని గుర్తు చేసుకున్నారు. అప్పటికి వాట్సప్, ఇతర సోషల్ మీడియా ఇంత విపరీతంగా లేని రోజులలో కూడా ఆయన కొన్ని వ్యాఖ్యలు చేశారన్నారు. **ఈ దేశంలో హిందువులను క్రిస్టియన్లుగా మతం మార్చడానికి వాటికన్ సిటీలో పోప్‌నుంచి సోనియా గాంధీ కొన్ని రహస్య సందేశాలు అందుకున్నారని, ఆ బాధ్యతను క్రైస్తవ మతానికి చెందిన వైఎస్ రాజశేఖర రెడ్డికి అప్పజెప్పారని వదంతులు లేవనెత్తారు. అక్కడితో ఆగకుండా తిరుమల తిరుపతికి చెందిన ఏడు కొండలలో మూడింటిని**

- మిగతా 3లో

• ఎడిటోరియల్

# వంద రోజుల్లో వెనక్కు తగ్గిన మోడీ!

ఆల్ ఈజ్ వెల్ అని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న మోడీ ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ అనేక విషయాల్లో గత మోడీ 1.0, 2.0ల మాదిరి దూకుడుగా వ్యవహరించలేకపోతుందనడం ఎంత కాదనుకున్నా దాచేస్తే దాగని సత్యం. వాస్తవానికి గతంలో మంత్రిత్వ శాఖలు నిర్వహించిన అనేకమంది ఇప్పటికీ కొనసాగుతున్నారు. రక్షణ మంత్రిగా రాజనాథ్ సింగ్, విదేశీ వ్యవహారాల మంత్రిగా జైశంకర్, ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్, రవాణా మంత్రిగా నితిన్ గడ్కరీ, హోం శాఖ మంత్రిగా అమిత్‌షాలు కొనసాగుతున్నారు. కానీ ఎన్నికల్లో లోక్‌సభలో బీజేపీ బలం తగ్గినప్పటి నుంచి కూటమి ఊతకర్రల సాయంతో మారిన రాజకీయ విధానాలు మనకు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ బీజేపీ మాత్రం మేము విధానపరంగా ఎక్కడా వెనక్కు తగ్గడంలేదని, ఇదే దూకుడుతో ముందుకు సాగుతామని బీరాలు పలుకుతున్నారు. వాస్తవానికి వివాదాస్పదమైన అనేక బిల్లులు గత ప్రభుత్వంలో కనీసం చర్చకు కూడా రాకుండా ఆమోదింపజేశారు. కానీ ఇప్పటి పరిస్థితిని బేరీజు వేసుకుంటే ఆగస్టు 15న వివాదాస్పద బిల్లు అయిన యూనిఫామ్ సివిల్ కోడ్, రామ్‌నాథ్ కమిటీ నివేదిక అయిన వన్ నేషన్ – వన్ ఎలక్షన్ వీటన్నింటినీ పరిశీలించినట్లయితే నిజమే కదా, ఏం మారింది.. బీజేపీ మునుపటి లాగే తన సొంత అజెండాతో దూసుకుపోతుంది అనిపిస్తుంది. వాస్తవానికి రాజకీయ పార్టీకి ఇటువంటి వాదన అవసరం. అందులోనూ బీజేపీ ఈ వ్యవహారంలో ఎంతో నిష్టాగరిష్టురాలు. అదానీకి సంబంధించి విచారణ కోసం ప్రతిపక్షాలు ఎంత అరిచి రాద్ధాంతం చేసినా కనీసం విచారణ కమిటీ కూడా వేయలేదు. కానీ ఇప్పుడు బీజేపీ ప్రవర్తిస్తున్న తీరు వాస్తవానికి విరుద్ధంగా ఉంది. ఉదాహరణకు వక్ఫ్ బిల్లుపై జేపీసీ (జాయింట్ పార్లమెంట్ కమిటీ)ని వేశారు. అలాగే లేటరల్ ఎంట్రీ వెనక్కు తీసుకున్నారు. నితీష్ కుమార్ ప్రభుత్వం, ఎల్‌జేపీ తదితర పార్టీలు తమ నిరసనలు తెలియజేస్తే అప్పుడు పై విధానంలో బీజేపీ వెనక్కు తగ్గడం మనందరికీ తెలుసు. వ్యవసాయ చట్టాల విషయంలో రైతులు ఏడాదిపాటు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తే అప్పుడు వెనక్కు తగ్గారు. అలాగే కొత్త పెన్షన్ విధానం కోసం చాలాకాలంగా పోరాడుతున్నారు. కాంగ్రెస్ తదితర పార్టీలు పాత పెన్షన్ విధానాన్నే కొనసాగిస్తామనడంతో ఈ పాత పెన్షన్ విధానంతో దేశం దివాళా స్థితికి చేరుతుందని వాదనలు చేస్తూనే కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని అవలంభించాలని బీరాలు పలికిన బీజేపీ ఇప్పుడు యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌గా మారుస్తామని నాలుగడుగులు వెనక్కు తగ్గి వెనక్కు తీసుకువచ్చాయి. ఇలాంటి పునఃపరిశీలన అంశాలన్నీ మోడీ 1.0, 2.0కు, ఇప్పటి మోడీ 3.0కు స్పష్టంగా తేడాను తెలియజేస్తున్నాయి. అలాగే కుల గణనకు సంబంధించిన విధానాలను కూడా అప్పట్లో ఎంతో నిష్కర్షగా కులగణన నిర్వహించే ప్రసక్తే లేదని మాట్లాడిన బీజేపీ ఇప్పుడు కులగణన నిర్వహిస్తామని పేర్కొనడం గమనార్హం. యూనిఫామ్ సివిల్ కోడ్‌లో ఎప్పుడూ లేని సెక్యులర్ యూనిఫామ్ సివిల్ కోడ్ అనే పదాన్ని జోడించడం గమనార్హం. బీజేపీకి అసలు ఇష్టపడని పదం ఏదైనా ఉందంటే అది సెక్యులరే. వాస్తవానికి రాజ్యాంగం నుండే సెక్యులర్ పదాన్ని తొలగిస్తామంటూ గత 1, 2 ప్రభుత్వాల్లో ఎంతోమంది ప్రభుత్వంలోని బాధ్యులు, పార్టీలో ఉన్నత స్థానంలో ఉన్నవారు ఎక్కువగా ఉటంకించేవారు. కానీ నేడు మోడీ నోట సెక్యులర్ యూనిఫామ్ కోడ్ అనే పదం సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తోంది. ఇటువంటి మార్పులకు ముఖ్య కారణం సంఖ్యాబలం అన్నది కాదంటూనే రాజీ పడుతున్న వైనాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. ఇక వన్ నేషన్, వన్ ఎలక్షన్ అనే విషయం ఎప్పుడూ బీజేపీకి అనుకూలంగానే ప్రాంతీయ పార్టీలు మద్దతు తెలిపాయి. ఉదాహరణకు బీఆర్ఎస్, ఆ మాటకొస్తే సమాజ్‌వాద్ పార్టీలు కూడా వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు మద్దతుగా నిలిచాయి. బీజేపీ మిత్రులు టీడీపీ, ఇతర పార్టీలు సరేసరి. ఈ విషయంలో అర్థమైనదేమిటంటే.. వన్ నేషన్, వన్ ఎలక్షన్ అంశం పెద్దగా పోలరైజ్ కానప్పటికీ రాజకీయంగా, రాజ్యాంగపరంగా, చట్టపరంగా అనేక సమస్యలు, సవరణలతో పాటు 50 శాతానికి మించి అసెంబ్లీలో ఆమోదం లాంటి అంశాలు వాస్తవానికి సవాల్‌గా నిలుస్తాయి. ఇక బడ్జెట్ విషయంలో కూడా అనేక అంశాలను వెనక్కు తీసుకుంటోంది ఇప్పటి బీజేపీ ప్రభుత్వం. కేపిటల్ గెయిన్ విషయంలో అది స్పష్టమైంది. దీన్ని బట్టి మనకు అర్థమవుతున్నది ఏమిటంటే.. గత ప్రభుత్వాల మాదిరిగా ఇప్పటికి కూడా సింబాలిక్‌గా చాలా బలంగా తమ సొంత అజెండాతోనే పరిపాలన చేస్తున్నామని బయటకు చెబుతున్నప్పటికీ పై అంశాలన్నింటిని పరిగణలోకి తీసుకుంటే కూటమి ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఉదాహరణకు బడ్జెట్‌లో బీహార్, ఆంధ్రప్రదేశ్‌లకు ప్రత్యేక నిధులు కేటాయించడంతో లోక్‌సభలోని బీజేపీకి తగ్గిన సంఖ్యాబలం ప్రభావం చాలా స్పష్టంగా కనిపిస్తున్న విషయం అర్థమవుతుంది.

# గోవిందరావు సేవలు మరువలేనివి

(సత్యంన్యూస్,పొందూరు)



నాలుగు దశాబ్దాల పాటు రెవెన్యూ శాఖలో విశిష్ట పాత్ర పోషించిన విశ్రాంత తహశీల్దార్ బలివాడ గోవిందరావు సేవలు మరువలేనివని విశ్రాంత జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. పదవీవిరమణ చేసిన గోవిందరావుకు,అతని సతీమణి అరుణకుమారిని ఆదివారం ఆయన సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ టైపిస్టు నుంచి తహశీల్దార్ వరకు అంచెలంచెలుగా ఎదిగిన గోవిందరావు రెవెన్యూ శాఖకు ఎన్నో సేవలు చేశారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎం.పి.డి.వో. కుప్పిలి శ్రీనివాసరావు, విశ్రాంత తహశీల్దార్ బలివాడ రాజమోహనరావు, విశ్రాంత గెజిటెడ్ హెచ్.ఎం పాలవలస దివాకర్ పాత్రో, ఆర్&బి ఏఈఈ కె.పాండురంగారావు, జెడ్పీ ఎ.వో కె.రామేశ్వరరావు, శిష్ట కరణ సంక్షేమ ప్రతినిధి కుప్పిలి రవికుమార్, విశ్రాంత ఎ.ఎస్.ఐలు పట్నాయకుని కృష్ణారావు, వెంకటరమణమూర్తిలు మాట్లాడారు.

# సాహిత్యానికి విమర్శ గీటురాయి


(సత్యంన్యూస్, రాజాం)

కవులు రచయితలు ఏమి రాసినా, దానిపై సద్విమర్శకుడు చేసిన విమర్శ ఆ సాహిత్యానికి గీటురాయని తానా నవలా బహుమతి గ్రహీత, సాహిత్య అకాడమీ సలహా బోర్డు సభ్యుడు చింతకింది శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 116వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పిల్లా తిరుపతిరావు రచించిన 'డమరుధ్వని-ప్రతిధ్వని' అనే విశ్లేషణాత్మక గ్రంథాన్ని చింతకింది ఆవిష్కరించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ విమర్శకులు చేసే విమర్శ సాహిత్యాన్ని సరైనమార్గంలో నడిపిస్తుందన్నారు. కవులు,రచయితలు విమర్శను సహృదయంతో, స్వీకరించిన నాడే మంచి సాహిత్యం తెలుగులో వెలవడుతుందన్నారు. సాహితీవేత్తలు సమాజాన్ని బాగా చదవాలని సామాజికమైన అంశాలే శాశ్వతత్వాన్ని పొందుతాయన్నారు. కళింగాంధ్రకు చెందిన అనేక కోణాలలో, అనేక రచనలు చేయవచ్చని, గ్రంథ పఠనంతోపాటు ఇక్కడి సమాజాన్ని బాగా అధ్యయనం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రచయిత పిల్లా తిరుపతిరావును వేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. వేదిక నిర్వాహకుడు గార రంగనాథం అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ ఆల్తి మోహనరావు పుస్తక పరిచయం చేశారు. సీరపాణి, దుప్పల రవికుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ గార రవిప్రసాద్, సూర్య శైలజ, గంటేడ గౌరునాయుడు, చందనపల్లి గోపాలరావు, గర్భాన సుమతి, పాట్నూరు కోటిబాబు, పొదిలాపు శ్రీనివాసరావు, రాజాపు శాంతారావు, గట్టి పాపారావు, సమతం మహేశ్వరరావు, ఉరిటి రామలింగేశ్వరరావు, పడాల కవీశ్వరరావు, నల్ల రవికుమార్, పెంకి చైతన్యకుమార్, పండూరి వేణుగోపాలరావు, అల్లక విశ్వనాథం, అంబళ్ళ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.




# అవయవదాత కుటుంబానికి ఆర్థిక సహాయం


(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)



మండలంలోని గొల్ల సీతారాంపురం గ్రామానికి చెందిన బొమ్మాళి బాలరాజు ఇటీవల విద్యుత్‌స్థంభం ఎక్కుతూ జారిపడి బ్రెయిన్‌డెడ్ అయి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన అవయవదానం చేసి సజీవుడయ్యా డు. అయితే అతనికి భార్య, చిన్నపాప ఉండడంతో వారు కడుపేదరికంతో జీవితాన్ని వెళ్లదీస్తున్నారు. విషయం తెలుసుకున్న టెక్కలి అభయం యువజన సేవా సంఘం ప్రతినిధులు స్పందించి ఆ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వీటిలో రూ.10వేలు ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ లింగాల రమేష్ అందించినట్లు సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు లాడి కామేశ్వరరావు, శ్రీనివాస్ బెహర, ధర్మవరపు పూర్ణా చారి, పిల్లల రమేష్, అద్దాల వీరభద్రాచారి, ఉంగరాల గోవిందరావు షణ్ముఖ పట్నాయక్, బోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





# నలభైలో ఇరవై!!

కన్నడ నటి జ్యోతి రాయ్‌ను తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. ముఖ్యంగా బుల్లితెర ప్రేక్షకులు జగతి మేడం అంటూ జ్యోతిరాయ్‌ను తెగ అభిమానిస్తూ ఉంటారు. ఆమె ను సీరియల్స్ లో పెద్ద వయసు ఉన్న పాత్రలో చూసి సోషల్ మీడియాలో ఈమె ఫోటోలు చూసిన వారు అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఉన్నారు. బాబోయ్ జగతి మేడం ఇంత వయసు తక్కువ అమ్మాయిగా కనిపిస్తుంది అంటూ కామెంట్స్ చేస్తూ ఉంటారు. పాతికేళ్ల అమ్మాయి మాదిరిగా జ్యోతి రాయ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఉంటాయి అనే కామెంట్స్ వస్తూ ఉంటాయి. తాజాగా మరోసారి జ్యోతిరాయ్ ఫోటోలతో సోషల్ మీడియాలో రచ్చ చేసింది. రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉన్న ఈమె మరోసారి క్లీవేజ్ షో అందాలతో కవ్విస్తూ కన్నుల విందు చేస్తుంది. సాధారణంగా హీరోయిన్స్‌కి సోషల్ మీడియాలో తెగ పాపులారిటీ ఉంటుంది. బుల్లి తెర స్టార్స్ అంటే లైట్ తీసుకుంటారు. కానీ జ్యోతిరాయ్ కి మాత్రం హీరోయిన్స్ రేంజ్‌లో గుర్తింపు ఉంది అనడంలో సందేహం లేదు. తాజాగా ఆమె షేర్ చేసిన ఈ ఫోటోలకు లక్షల్లో లైక్స్, వేలల్లో కామెంట్స్ షేర్స్ నమోదు అవుతున్నాయంటే ఆమె క్రేజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. కన్నడకు చెందిన జ్యోతి రాయ్ వయసు నాలుగు పదుల వయసుకు చేరువ అయింది. కానీ పాతికేళ్ల అమ్మాయి మాదిరిగానే కనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. మరోసారి జ్యోతిరాయ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోల వల్ల అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కన్నడ సీరియల్స్ ద్వారా కెరీర్ ను ప్రారంభించిన ఈమె తెలుగులో ఎక్కువ పాపులారిటీని సొంతం చేసుకుంది. ఆ పాపులారిటీతోనే సిరిమాల్లో, సిరీస్ ల్లోనూ నటిస్తూ కెరీర్ లో ముందుకు సాగుతోంది. ఈ స్థాయి అందాల ఆరబోత కేవలం జగతి మేడంకే చెల్లింది అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. జ్యోతిరాయ్ ఓకే అనాలే గాని వరుసగా ఐటెం సాంగ్స్ చేసే అవకాశాలు సైతం రావచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈమె గతంలో కన్నడ దర్శకుడు సుక్కు పూర్వాజ్ తో రిలేషన్ లో ఉందనే వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ప్రెట్టీ గర్ల్, నో మోర్ సీక్రెట్స్ అనే వెబ్ సిరీస్‌ల్లో నటిస్తోంది. త్వరలోనే ఆ వెబ్ సిరీస్‌లు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. తెలుగు తో పాటు ఇతర భాషల్లోనూ ఈమెకు ఉన్న క్రేజ్ కారణంగా అన్ని భాషల్లోనూ డబ్ చేస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. సోషల్ మీడియాలో తరచూ అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తున్న జ్యోతిరాయ్ మరి కొంత కాలం ఇదే అందంతో అలరించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# డబ్బు కోసం ఏమైనా చేస్తుంది!!



సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్ల మధ్య పోటీ తత్వం మాత్రమే కాదు ఈర్ష్య, పగ, అసూయ వంటివి కూడా ఉంటాయి. ఒక హీరోయిన్‌కి ఎక్కువ అవకాశాలు వస్తే మరో హీరోయిన్ అస్సలు ఓర్చుకోదు. కాజల్ అగర్వాల్ ఓ హీరోయిన్‌ని చాలా దారుణంగా అవమానించిందట. మరి ఆ హీరోయిన్ ఎవరు.. అనేది ఇప్పుడు చూద్దాం.. కాజల్ అగర్వాల్ అవమానించింది ఎవర్నో కాదు తమన్నానే.. అయితే గతంలో తమన్నా నేను పారితోషికం ఆకర్షణయంగా ఉంటే అది చిన్న రోలైన, ఐటమ్ సాంగ్ అయినా,లిప్ లాక్ సన్నివేశమైనా సరే నటించడానికి ఓకే చెబుతాను అని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. అయితే ఇదే విషయంపై కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ.. నేను అందరిలాంటి దాన్ని కాదు.. డబ్బు కోసం కక్కుర్తి పడి ఎలాంటి పాత్రనైనా ఒప్పుకోవడం నాకు ఇష్టం ఉండదు.. డబ్బు ఇస్తే ఎలాంటి పాత్రలోనైనా నటించడానికి నేను ముందుకు రాను. నాకంటూ కొన్ని రూల్స్ ఉంటాయి..అంటూ పరోక్షంగా తమన్నాని ఉద్దేశించి కాజల్ మాట్లాడిందట. అయితే కాజల్ ఆ మాటలు మాట్లాడడానికి కారణం ఓ సీనియర్ హీరో సినిమాలో కాజల్‌కి అవకాశం వచ్చిందట. కానీ కాజల్ మాత్రం ఆ హీరో సినిమాలో నేను సెట్ కాను. ఆ హీరోకి నాకు మధ్య ఏజ్ గ్యాప్ ఎక్కువగా ఉంటుంది అని రిజెక్ట్ చేసిందట. కానీ అంతకుముందే చిరంజీవి నటించిన 150 వ సినిమా ఖైదీ నెంబర్ 150 లో హీరోయిన్ గా చేసింది. కానీ ఆ తర్వాత మరో సీనియర్ హీరో మూవీలో అవకాశం వస్తే మాత్రం నాకు ఆ హీరోకి సెట్ అవ్వదు అంటూ రిజెక్ట్ చేసిందట.



- తెలుగులైవ్స్.కామ్ సౌజన్యంతో...

# మార్చి 28.. బీ రెడీ!

జనసేనానివ పవన్‌కల్యాణ్ ఇప్పుడు సినిమాలపై మళ్లీ ఫోకస్ చేశారు. ఆయన కొత్త సినిమాలకు సంబంధించిన అప్ డేట్లు ఒకొక్కటిగా బయటకు వస్తున్నాయి. 'ఓజీ'కు సంబంధించి శింబు ఓ పాట పాడితే, దాన్ని ఇటీవలే రికార్డ్ చేశారు. ఇప్పుడు 'హరి హర వీర మల్లు' రిలీజ్ డేట్ ప్రకటించారు. మార్చి 28న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం అధికారిక ప్రకటన విడుదల చేసింది. అంటే 2025 వేసవి సీజన్‌కు వీరమల్లు బోణీ కొట్టబోతున్నాడన్నమాట. అప్పటికి పరీక్షలు పూర్తవుతాయి. వేసవి సీజన్ మొదలవుతుంది. కొత్త సినిమాల హడావుడి అక్కడ్నుంచే షురూ అవుతుంది. కాబట్టి వీరమల్లుకు మంచి డేట్ దొరికినట్టే. వీరమల్లుని రెండు భాగాలుగా రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. తొలి భాగంలో కొంతమేర క్రిష్ ఆధ్వర్యంలో నడిచింది. ఆ తరవాత ఆయన వేరే సినిమా పనుల్లో పడిపోయారు. ఆ తరవాత దర్శకత్వ బాధ్యతని జ్యోతికృష్ణ స్వీకరించారు. ఏ.ఎం.రత్నం ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. కీరవాణి సంగీతాన్ని సమకూరుస్తున్నారు. మొఘలాయిల పరిపాలనా నేపథ్యంలో సాగే కథ ఇది. వీరమల్లు ఓ దొంగగా కనిపించనున్నాడు. ఈ సినిమా కోసం చార్మినార్, గోల్కొండ సెట్స్ వేశారు. ప్రస్తుతం విజయవాడ పరిసర ప్రాంతాల్లో యుద్ధ సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. త్వరలోనే పవన్ కూడా 'వీరమల్లు' సెట్లో అడుగు పెట్టబోతున్నాడు.




- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

చిలుక కొరికిన పండు తియ్యన. ఆ పండు రుచే రుచి. చిలుక కొరకడం వల్ల పండు తియ్యగా మారదు. మొత్తం చెట్టుకాయల్లో ఏది తియ్యగా ఉంటుందో పసిగట్టి దాన్నే చిలుక కొరుకుతుంది. చిలుక ప్రత్యేకత అది. నృసింహ శతకంలో అడవిపక్షులకెవడు ఆహారమిచ్చెను? అని ప్రశ్న. అడవి పక్షుల ఆహారం గురించి తర్వాత సంగతి. ముందు జనారణ్య పక్షులమైన మనం తినే ఆహారం ఎంత ఆరోగ్యంగా ఉందో తెలుసుకుంటే వీధివీధికి కార్పొరేటు ఆసుపత్రులు మూడు బెడ్లు ముప్పైమంది రోగులుగా ఎందుకు క్షణక్షణ ప్రవర్ధమానమవుతున్నాయో అర్థమవుతుంది.

# మనం తినే విషం



కడుపునకు అన్నం తింటున్నారా, గడ్డి తింటున్నారా? అన్నది తిట్టు. సాధారణంగా పశువులు గడ్డి తింటాయి. ఇందులో పచ్చి గడ్డి, ఎండు గడ్డి రెండు రకాలు. మనుషులు సాధారణంగా గడ్డి తినరు. తినకూడదని రూలేమీ లేదు. రాజ్యాంగం ఇచ్చిన ఎన్నో స్వేచ్ఛల్లో ఏ ఆహారం తినాలన్నది కూడా ఒక స్వేచ్ఛ. ఫలానాదే తినాలని నియమం లేదు కాబట్టి కొందరు నానా గడ్డి కరుస్తుంటారు. అయితే.. ఈ తిట్టులో అన్నానికి ప్రాధాన్యం, గడ్డికి నీచార్థం రావడాన్ని కొన్ని తెలివైన పశువులు అనాదిగా అంగీకరించడం లేదు. తమకు ప్రాణాధారమైన గడ్డిని అంత గుడ్డిగా ద్వేషించాల్సిన పని లేదన్న పశువుల అభ్యంతరం సమంజసమైనదే. అలాగే కడుపునకు గడ్డి తినడం అలవాటు చేసుకున్న మనుషులు కూడా అనాదిగా అంగీకరించడం లేదు.

మనం కడుపునకు అన్నం తింటున్నామనుకుంటూ విషం తింటూ ఉంటాం. పున్నమినాగు సినిమాలో రోజూ అన్నంలోకి చుక్క విషం కలుపుకుని తినడం వల్ల హీరోను పాము కరిచినా పాము చస్తుందే కానీ హీరోకు ఏమీ కాదు. అలా రోజూ మనం నానా గడ్డి కురుస్తున్నా.. కాలకూట విషమే తింటున్నా.. శరీరానికి అలవాటైపోవడం వల్ల బతికి బట్టగట్టకలుగుతున్నామేమో!

మనం తినే గింజలను పండించే రైతులు కూడా పురుగుల మందులు, ఎరువుల ఘాటుకు అనారోగ్యం పాలవుతున్నారు. శ్వాసకోశ వ్యాధులతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. భారతీయ వైద్య పరిశోధన మండలి, జాతీయ పోషకాహార సంస్థ అధ్యయనం ప్రకారం తెలంగాణ పొలాల్లో మోతాదుకు మించి పురుగుల మందులు చల్లుతున్నారు. యూరియా వాడకం కూడా అధికంగా ఉంది. ఈ పురుగుల మందుతో పంటకు చీడ పీడలు పట్టకపోవడం తర్వాత సంగతి. వాటిని చల్లుతున్నప్పుడు ఆ ఘాటుకు రైతులే స్పృహ తప్పి పడిపోతున్నారు. రబ్బరు గ్లౌజుల్లేకుండా నేరుగా చేత్తో మందులు, యురియాలు చల్లడం వల్ల రైతుల చేతుల చర్మం మీద మచ్చలు పడుతున్నాయి. కాపు చేతికొచ్చేలోపు రైతు మంచాన పడి ఉంటున్నాడు.

జీవవైవిధ్య శాస్త్రవేత్తలు చెప్పిన ఒక మాట.. పుచ్చులున్న కాయల్లోనే మంచివి ఏరుకోవాలట. నిగనిగలాడే పళ్లు కాకుండా నాలుగు రోజులు కాగానే మచ్చలు పడే పండ్లు, మెత్తబడే పండ్లు బాగున్నపుడు (మనంకాదు - పండ్లు) తినాలట. లేకపోతే పురుగులు కూడా ముట్టని కాయలు, పళ్లు మనం తింటున్నందుకు పురుగులు పడకుండానే పోతాం్రా.. అని పురుగులు కూడా మనల్ని శపిస్తాయట!

పైరు మీద స్ప్రే చేసేప్పుడు రైతే స్పృహదప్పి పడిపోయేంత పురుగుల మందులను ఆ పంట ద్వారా అక్షరాలా మనం తింటున్నామన్న సంగతి బయటెక్కడా చెప్పకండి. నలుగురూ నవ్విపోతారు! ఆ నోటా ఈ నోటా విని పురుగులు కూడా పడి పడి నవ్వుకుంటాయి!

– పమిడికాల్వ మధుసూదన్

## గ్రామసభ నిర్వహించకుండా లబ్దిదారుల ఎంపిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కోర్టులో కేసు పెండింగ్ ఉండగా రాజకీయ నాయకుల వత్తిడితో గ్రామ సభలను నిర్వహంచకుండా ఇల్లు పంపిణీ చేయడంపై కుందువానిపేట సర్పంచ్ సూరాడ సూర్యం జేసీకి విన్నవించారు. సోమవారం జెడ్పీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో జేసీకి ఫిర్యాదు చేశారు. గ్రామంలో 2014 వచ్చిన హుదూద్‌కు ఇల్లు కోల్పోయిన బాధితులకు కేంద్ర ప్రభుత్వం నిర్మించిన ఇల్లు పంపిణీపై అప్పటి సర్పంచ్ అప్పన్న హైకోర్టును ఆశ్రయించి నిలుపుదల చేశారని వివరించారు. ఆ తర్వాత కోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి రెవెన్యూ, హౌసింగ్ అధికారులు ద్వారా లబ్ధిదారుల జాబితాను రూపొందించి 288 ఇళ్లలో 217 ఇల్లు పంపిణీ వైకాపా హాయంలో జరిగాయని వివరించారు. ఇల్లు ఇస్తామని చెప్పి అప్పటి సర్పంచ్ అనర్హులను లబ్ధిదారుల జాబితాలో చేర్చి వారి నుంచి నగదు వసూలు చేశారని వివరించారు. అప్పటి సర్పంచ్ డబ్బులు తీసుకున్న వారెవరూ అర్హులు కానందున రెవెన్యూ అధికారులు కొత్త జాబితాను తయారు చేసి పంపిణీ చేయడానికి నిర్ణయించారన్నారు. దీనిపై అప్పటి సర్పంచ్ అప్పన్న మరోమారు కోర్టును ఆశ్రయించడంతో 77 మందికి ఇళ్లు పంపిణీ నిలిచిపోయిందన్నారు. ఇప్పటికీ కోర్టులో వివాదం నడుస్తుండగా అనర్హులతో ఒక జాబితాను తయారు చేయించి పంపిణీకి సిద్ధమవుతున్నారని వివరించారు. ఏడాది క్రితం 77మంది అర్హులకు ఇల్లు పంపిణీ చేయడానికి నిర్ణయిస్తే న్యాయస్థానంలో వివాదం నడుస్తున్నందున ఉన్నతాధికారులు నిలుపదల చేశారని జేసీకి వివరించారు. ఇప్పటికీ న్యాయస్థానంలో వివాదం నడుస్తున్నా మండల అధికారులు రాజకీయ నాయకులు వత్తిడితో అనర్హుల జాబితాను తయారుచేయించి ఇల్లు పంపిణీని చేపట్టడానికి సిద్ధమవుతున్నారని వివరించారు. గ్రామంలో జాబితాను ప్రదర్శించకుండా, గ్రామసభ నిర్వహించకుండా, జాబితా పరిశీలన చేయకుండా ఇళ్ల పంపిణీ చేయడంపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని, దీనిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సూరాడ సూర్యంతో పాటు కొందరు లబ్ధిదారులు కోరారు.



ఇండియాలో జేసిస్ స్థాపించి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కలకత్తాలో డైమండ్‌జూబ్లీ సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా శ్రీకాకుళం జూనియర్ ఛాంబర్ పేరుతో 38 సంవత్సరంలు జేసీస్ పూర్తి చేసిన డాక్టర్ జెసి జామి భీమ శంకరరావును జాతీయ అధ్యక్షులు రాకేష్‌శర్మ ఘనంగా సత్కరించారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## ఎస్‌వీసీటీ ఆధ్వర్యంలో రీడింగ్‌రూమ్

(సత్యంన్యూస్, నరసన్నపేట)

మండలంలోని పంతులవానిపేటలో శ్రీ స్వామి బాబు & వజ్రమ్మ చారిటబుల్ ట్రస్ట్ (ఎస్‌వీసీటీ) ఆధ్వర్యంలో సామాజిక భవనంలో రీడింగ్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు రమేష్, రామారావులు మాట్లాడుతూ ఈ రీడింగ్ రూమ్ పోటీ పరీక్షల్లో పాల్గొనే యువతకు, చదువుకునే విద్యార్థులకు మంచి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గతంలో గేదెలవానిపేటలో నెలకొల్పిన రీడింగ్ రూమ్‌ని యువత వినియోగించుకొని చాలామంది ఉద్యోగాలు సంపాదించుకున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా పంతులువానిపేట గ్రామంలో మొక్కలు కూడా నాటి మొక్కలు పెంచడం యొక్క ప్రాముఖ్యం గురించి పెద్దలు గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో అలయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ జామి చంద్రశేఖర్, అధ్యక్షులు నాగేశ్వరరావు, జామి నాగభూషణరావు, సాన గోవిందరావు, గ్రామ పెద్దలు గురయ్య, గ్రీన్ టీమ్ లీడర్స్ గోవిందు, శంకర్, రమణలు పాల్గొన్నారు.



## లడ్డూ నాణ్యతను పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇటీవల రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరసవిల్లి సూర్యనారాయణస్వామి లడ్డూ ప్రసాదాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు అందజేస్తున్న సౌకర్యాలను, క్యూలైన్లను పరిశీలించి మెరుగైన సేవలు అందించాలని ఆలయ సిబ్బందికి సూచించారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రసాదాల కార్యశాలను పరిశీలించారు. నిత్యాన్నప్రసాద పాకశాలను పరిశీలించి భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అన్న ప్రసాదం తయారీలో నిర్దేశాలను పాటిస్తున్నారన్నారు. ఇంకా పాతపద్ధతులనే అనుసరించి ప్రసాదాలను తయారు చేస్తున్నారని, పాకశాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. భక్తుల మనోభావాల దృష్ట్యా నాణ్యమైన ప్రసాదాన్ని అందజేయాలని నాణ్యతలో రాజీ పడొద్దని అధికారులకు సూచించారు. అలాగే ఇంద్రపుష్కరిణి, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. దేశంలోనే అరసవల్లికి ప్రఖ్యాత పుణ్యక్షేత్రంగా పేరు ప్రతిష్టలు ఉన్నాయన్నారు. అధికారులంతా చిత్తశుద్ధితో విధులు నిర్వహించి మరింత ఖ్యాతి పెంచేలా కృషి చేయాలని సూచించారు. ఈయనతో పాటు ఆలయ ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు, ఆలయ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ముంజేటికి మాతృవియోగం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సీనియర్ దళిత నాయకులు, మాజీ నాటక అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి తల్లి అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. ఈ సందర్భంగా పలువురు గార గ్రామంలో ముంజేటి నివాసానికి చేరుకుని ఆమెకు నివాళులర్పించారు.

## బాబుతో అట్లుంటది మరి!

(మొదటిపేజీ తరువాయి)

**వివిధ చర్చిలకు ధారాదత్తం చేస్తున్నట్టు పుకార్లు లేవదీశారు.**

**సుద్దపూస చంద్రబాబు సూక్తులు**

2021లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ మతపరమైన మార్పిడులకు సహకరిస్తున్నారంటూ చంద్రబాబు అభియోగం మోపారు. విజయనగరం జిల్లా రామతీర్థాలలో రాముడి విగ్రహం పగిలిపోయినప్పుడు, సంఘటన స్థలాన్ని సందర్శించిన అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి వరకూ 127 హిందూ దేవాలయాలపై దాడులు జరిగినట్టు ఫిర్యాదు చేస్తూ హిందువుల మనోభావాలతో ముఖ్యమంత్రి ఆడుకుంటున్నారని విమర్శించారు. ఆయన అక్కడితో ఆగకుండా, హిందే దేవాలయాలను నిర్లక్ష్యం చేస్తూ, మత మార్పిడులను ప్రోత్సహిస్తున్నారని చెరిగిపారేశారు. పలుమార్లు జగన్ క్రైస్తవ మతానికి చెందిన వ్యక్తిగా, ఆయన వ్యక్తిగత మత విశ్వాసాన్ని సభలలో ప్రసంగిస్తూ, ప్రణాళికాబద్ధంగా ఆయనపై బురద జల్లడాన్ని మనం గమనించవచ్చు. మరో సందర్భంలో టిడిపి పార్టీ సమావేశంలో వైఎస్ జగన్ మత విశ్వాసాలపై బహిరంగంగా బురద జల్లడానికి ప్రయత్నించారు. **“నా ఆరాధ్య దైవం వెంకటేశ్వర స్వామి. నీ ఆరాధ్య దైవం జీసస్ క్రైస్ట్. నువ్వు ఎన్నికలలో గెలిస్తే జెరూసలెం వెళ్తావు, అదే నేను తెలిస్తే తిరుపతి వెళ్తాను. నీతో ఎప్పుడూ బైబిల్ ఉంటుంది. అందులో తప్పేమీ లేకపోవచ్చు. కానీ, హిందూ దేవాలయాల మీద దాడులు జరిగినప్పుడు మాత్రం నేను ఉపేక్షిం చేది లేదు” అంటూ విరుచుకుపడ్డారు.** ఇదంతా ప్రజలలో నెమ్మదిగా జగన్మోహన్ రెడ్డి అనుసరించే మతం గురించి ప్రజల మనస్సులలోకి ఎక్కించడానికే అని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

సీనియర్ రాజకీయ విశ్లేషకుడు డాక్టర్ కె.నాగేశ్వర్ ఈ విషయమై మాట్లాడుతూ, “రాజకీయ వ్యాఖ్యలు నాలుగు రోజులకు ప్రజలు మర్చిపోతారు. వారిని వీరు, వీరిని వారు ఎన్నయినా అనుకోవచ్చు. కాని, చంద్రబాబు చేసిన ఈ వ్యాఖ్యల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటాయి. వాటిని అంత సులువుగా వారు మర్చిపోలేరు. అందువల్ల దీనిమీద పూర్తిస్థాయి విచారణ జరిగి నిజానిజాలు తేల్చాలి” అని కోరారు. ఎటువంటి ఆధారాలతో ముఖ్యమంత్రి ఆవిధంగా మాట్లాడారు? ఎవరితో న్యాయ విచారణ జరిపించారు? ఏ విధమైన సాక్ష్యాలు ఆయన వద్దనున్నాయి? ఇంతకీ తిరుమల పోలీస్ స్టేషనులో ఇప్పటివరకూ కేసు ఫైల్ చేశారా? ఎవరిని నిందితులుగా చేర్చారు? ఇవి చాలా ముఖ్యమైన విషయాలని చెప్పారు. విహెచ్‌పి లాంటి హిందూ సంస్థలు కూడా ఈ విధమైన డిమాండ్‌తో ఇంతవరకూ రాకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దీనినిబట్టి చూస్తే ఇదంతా పొలిటికల్ మైలేజీ కోసం సృష్టించిన టీ కప్పులో తుపానులాగా కనిపిస్తోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

– ది వైర్ సౌజన్యంతో..

## చలపతిని అభినందించిన ఎమ్మెల్యే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక పొట్టి శ్రీరాములు జంక్షన్ అన్నా క్యాంటీన్ నిర్వాహకులు కూన చలపతి జీవ రత్నం దంపతులను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం అభినందించారు. అన్నా క్యాంటీన్‌ను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుతున్నారని, ప్రజలు సంతృప్తిగా భోజనం చేసి, అన్నా క్యాంటీన్ సిబ్బంది పనితీరు బాగుందని చాలామంది దివ్యాంగులు, వృద్ధులు, ప్రజలు సమాచారం అందించారని తెలిపారు. అలాగే అన్నా క్యాంటీన్ లోపలకి రాలేని వికలాంగులకు, వృద్ధులకు కాళ్ల వద్దకే భోజనం అందజేయడం గొప్ప సేవా దృక్పథం అని కొనియాడారు. వికలాంగులకు తమ బండి వద్దకే భోజనాన్ని అందించడం గొప్ప విషయమన్నారు.



## స్వర్ణాంధ్ర లక్ష్యంగా 2047 విజన్ డాక్యుమెంట్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రూపొందిస్తున్న స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్‌లో జిల్లాస్థాయి ప్రణాళిక ప్రస్ఫుటంగా ఉండేలా ప్రజలు, ప్రజాప్రతినిధుల సూచనలు సలహాలు స్వీకరిస్తున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ వికసిత్ భారత్ నేపథ్యంలో రాష్ట్రంలో స్వర్ణాంధ్ర-2047 లక్ష్యసాధన కోసం మండల, జిల్లాస్థాయిలో అభిప్రాయ సేకరణ అనంతరం ఆయా ప్రణాళికలను క్రోడికరించి జిల్లాస్థాయి ప్రణాళికను అక్టోబరు 15లోగా ప్రభుత్వానికి అందజేయనున్నామని, ఇందులో భాగంగా రానున్న ఐదేళ్ల కాలంలో 2024 నుండి 2029 వరకు ఒక విజన్‌తో కూడిన నివేదిక రూపొందించ వలసివుందన్నారు. జిల్లాలోని ప్రతి శాఖ ఈ లక్ష్యసాధనలో నిర్ణయాత్మక పాత్ర పోషించ వలసివుందన్నారు. స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంటేషన్ రూపకల్ప నలో భాగంగా సెప్టెంబరు 21 నుండి అక్టోబరు ఐదవ తేదీ వరకు నిర్వర్తించవలసిన కార్యాచరణను వివరించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులు, బ్యాంకర్లు, రైతులు, వాణిజ్యరంగం, ఇతర అసోషియేషన్లు తదితరులతో కూడా సమావేశాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. స్వర్ణాంధ్ర-2047 ప్రాముఖ్యతపై పాఠశాల, ఇంటర్మీడియేట్ తదితర కళాశాలల స్థాయిలో వక్తృత్వ, క్విజ్ పోటీలు, చర్చాగోష్టులు నిర్వహించేందుకు, అలాగే గ్రామపంచాయితీ స్థాయిలో గ్రామసభలు కూడా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. తద్వారా ప్రణాళికలో ప్రజల సూచనలు, సలహాలను స్వీకరించి వ్యవసాయ, ఉద్యాన, మత్స్య రంగాల్లో ప్రస్తుత విస్తరణ, దిగుబడులు, రానున్న రోజుల్లో అంతరసాగు విధానం, ఆదాయం పెంపు, ప్రకృతిసాగు విస్తీర్ణ పెంపు, తదితర అంశాలు, పారిశ్రామిక, పర్యాటకరంగ, ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్ల స్థాపన వంటి అంశాలను ప్రణాళికలో జోడిస్తున్నామని, ఇందుకోసం ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ కోసం 11 ప్రశ్నలతో కూడిన క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచామని వాటి ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



























ఒక్కో రాజకీయ పార్టీకి ఒక్కో లాంటి లక్షణం ఉంటుంది. పార్టీ పేరు చెప్పినంతనే వారు ఎలాంటి వాదాన్ని వినిపిస్తారో తెలియంది కాదు. తాజాగా దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంలో ఏపీ బీజేపీ తీరు విమర్శలకు తావిస్తోంది. బీజేపీ అన్నంతనే హిందుత్వ అన్న ముద్ర ఉన్న ఆ పార్టీ.. ఏపీలో అధికార కూటమిలో భాగస్వామి. ఇలాంటి వేళ తమ రాజకీయ ప్రత్యర్థులు చేసిన తప్పులను ఎండగట్టటమే కాదు.. దానికి సంబంధించిన చేపట్టాల్సిన కార్యక్రమాలు చాలానే ఉంటాయి. కానీ.. ఆ విషయంలో ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిచ్చేలా మారింది.

# పవన్ ముందు చిన్నబోయిన బీజేపీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీవారి లడ్డూ కల్తీ ఎపిసోడ్ మొత్తాన్ని చూస్తే.. టీడీపీ, జనసేన దూకుడు ముందు ఏపీ బీజేపీ నేతలు వెలవెలపోవటమే కాదు.. వారి వాయిస్ ఎక్కడా వినిపిస్తున్న పరిస్థితి లేదు. నిజానికి కమలనాథులు చేయాల్సిన పనిని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేస్తున్నారని చెప్పాలి. లడ్డూ అంశాన్ని తీవ్రంగా తీసుకోవటమే కాదు.. మిగిలిన రాజకీయ పార్టీల తీరుకు భిన్నంగా పవన్ ప్రకటిస్తున్న నిర్ణయాలు మిగిలిన రాజకీయ పార్టీలకు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.

సాధారణంగా ఒక దుర్మార్గ ఘటన జరిగినప్పుడు దాన్ని తీవ్రంగా ఖండించటం, దానిమీద ఘాటు విమర్శలు చేయటం మామూలే. అందుకు భిన్నంగా లడ్డూ ఎపిసోడ్‌లో సగటు హిందువుగా ప్రాయశ్చిత దీక్ష చేపట్టిన పవన్ తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కాలంలో మరే పార్టీ అధినేత కానీ.. కరుడుకట్టిన హిందుత్వ వాదులు సైతం తీసుకోని నిర్ణయాన్ని తీసుకోవటం ద్వారా పవన్ కొత్త విధానానికి తెర తీశారని చెప్పాలి. అలా అని అన్యమతం మీద ఆయన విరుచుకుపడటం లేదు. ఒక ధర్మానికి జరిగిన నష్టాన్ని మాట్లాడటం.. మిగిలిన ధర్మాల పట్ల మర్యాద.. గౌరవాన్ని ప్రదర్శించటం ద్వారా.. అందరికి ఆమోదయోగ్యంగా వ్యవహరిస్తున్నారు.

నిజానికి పవన్ చేయాల్సిన దీక్షను.. ఏపీ బీజేపీకి చెందిన అగ్రనేతలు కలిసికట్టుగా చేయటం.. దాన్నో ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. అలాంటి వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవటంలో వెనుకపడ్డారని చెప్పాలి. దేశ రాజకీయాల్లో సాఫ్ట్ హిందుత్వ పార్టీల లేమి ఎప్పటి నుంచో వెంటాడుతోంది. ఆ కొరతను తీర్చిన మొదటి పార్టీగా జనసేనను చెప్పాలి. నిజానికి ఈ అవకాశాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ అందిపుచ్చుకుంటుందని, అదే జరిగితే జాతీయ స్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నాయ పార్టీగా నిలుస్తుందని పలువురు భావించేవారు. కానీ.. కేజ్రీవాల్ ఆ దిశగా అడుగులు వేయలేదు. ఈ విషయంలో జనసేనాని కొత్త పంథాను ఎంచుకున్నారని చెప్పాలి. సాఫ్ట్ హిందుత్వలో హిందువుల పక్షపాతిగా వారికి అండగా ఉండటం, వారి ప్రయోజనాలకు భంగం వాటిల్లే అంశాల పట్ల ఓపెన్‌గా మాట్లాడటం, సెక్యులర్ శక్తులుగా చెప్పుకునే పక్షాలకు భయపడకుండా ధీటుగా వాదనల్ని వినిపించటమే కాదు.. అన్యమతాల పట్ల కించిత్ తగ్గని గౌరవాభిమానాల్ని ప్రదర్శించటం ఉంటుంది. ఈ తరహా బ్లెండ్ ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీకి లేదనే చెప్పాలి. పవన్ తీరు ఇందుకు తగ్గట్లే ఉంది. తాజాగా ఆయన చేపట్టిన దీక్షతో అది రూఢీ అయ్యిందని చెప్పాలి. ఏమైనా.. శ్రీవారి లడ్డూ కల్తీ వేళలో.. ఏపీలో మరింత హోల్డ్ పెంచుకోవాల్సిన బీజేపీ.. తమకంత సీన్ లేదన్న విషయాన్ని చెప్పకనే చెప్పేసిందని చెప్పాలి.

**మరోసారి వార్తల్లోకి ఎక్కారు!**

మొదటిసారి మోడీ 'యే పవన్ నహీ తుఫాన్ హై' అన్నప్పుడు.. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ప్రమాణ స్వీకారం చేసిన రోజున వేదిక మీద మోడీ అన్న మాటలవి. మోడీ వ్యాఖ్య మీద స్పందించిన నెటిజన్లు మన దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులు ఎవరీ పవన్ కళ్యాణ్ అంటూ గూగుల్‌లో సెర్చ్ చేశారు. గూగుల్‌లో ఆ రోజు ఎక్కువ హిట్స్ పవన్‌కళ్యాణ్ గురించే జరిగాయి. మళ్లీ శనివారం దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాలలో పవన్‌కళ్యాణ్ గురించి చర్చ మొదలైంది.

**మంచివారెవరూ లేరిక్కడ!**

చిత్తూరుకి చెందిన సారా కాంట్రాక్టర్ ఆదికేశవులు నాయుడుని టీటీడీ చైర్మన్‌గా నియమించింది చంద్రబాబే. కరుణాకర్ రెడ్డిని టీటీడీ చైర్మన్‌గా నియమించింది వైఎస్సార్. మళ్లీ చెన్నైకి చెందిన శేఖర్‌రెడ్డిని టీటీడీ బోర్డు సభ్యుడుగా నియమించింది చంద్రబాబే. వైవీ సుబ్బారెడ్డిని టీటీడీ చైర్మన్‌గా నియమించింది జగనే. వీఐపీ దర్శనం పేరుతో కోట్లు వెనకేశారు రోజా అనే ఆరోపణలున్నాయి.

**అసలు దీనికి పరిష్కారం ఏమిటి?**

మొన్న పవన్ ఒక ప్రకటన చేశారు.. జాతీయ స్థాయిలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఒక సంస్థని ఏర్పాటు చేసి దేశంలోని అన్ని దేవాలయాలను ఆ సంస్థ పర్యవేక్షణలోకి తీసుకురావాలి. ఇది దేశంలోని అన్ని ప్రాంతాలలోని రాజకీయ పార్టీలకి సెగ తగిలింది. ఒకవేళ పవన్ కోరినట్లుగా మోడీ, అమిత్ షాలు కనుక ఆ దిశగా అడుగులు వేస్తే అది బీజేపీ మరింత బలపడే ప్రమాదం ఉందని భయం! అఫ్కోర్స్! తిరుపతి లడ్డు వివాదం మీద అమిత్ షా సీరియస్‌గా ఉన్నారు. మరోవైపు జేపీ నడ్డా వివరంగా నివేదిక ఇవ్వమని చంద్రబాబుని కోరారు. ఇక ప్రకాష్‌రాజ్ అయితే పవన్‌కి ఒక విజ్ఞప్తి చేస్తూ ప్రభుత్వం మీదే కనుక విచారణ చేసి దోషులని అరెస్ట్ చేస్తే పోయేదానికి దేశానికి కలిపి ప్రత్యేకంగా కొత్త సంస్థ ఎందుకని వాపోయారు. ఎందుకొచ్చిన గోల అని అనుకున్నారేమో కర్ణాటక ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో నందిని నెయ్యినే వాడాలని ఆదేశాలు ఇచ్చింది. ఇది ఒక చెయిన్ రియాక్షన్ అనుకోవాలి పవన్ ప్రకటనకి. మన తెలుగు మీడియాలో పెద్దగా కవరేజీ లేదు కానీ పవన్ చేసిన ప్రకటన మాత్రం ఉత్తరాదిన బాగా వైరల్ అవుతున్నది. ఒక సిద్ధాంతం కలిగిన రాజకీయ నాయకుడుగా జాతీయ స్థాయిలో ఇప్పుడిప్పుడే తన ఉనికిని చాటుకుంటున్నారు పవన్ కళ్యాణ్.

# దసరా నుంచి 'కొత్త' సరదా!

మొదటిపేజీ తరువాయి

కొల్లివలస, నరసన్నపేట నియోజకవర్గంలో పిన్నింటిపేట, టెక్కలి నియోజకవర్గంలో సంతబొమ్మాళి వంటి రూరల్ ప్రాంతాల్లో షాపులపైనే వ్యాపారస్తులు ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు పలాస వంటి ఆర్థిక లావాదేవీలు ఎక్కువ జరిగే ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ సేల్ ఉండటంతో వాటికే ఎక్కువ దరఖాస్తులు వేయడానికి వ్యాపారస్తులు సిద్ధపడుతున్నారు. నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజుతో కలుపుకొని లైసెన్స్ ఫీజును లెక్కించి వడ్డీ లెక్కలు చూస్తే వ్యాపారంలో పెద్దగా కిట్టుబాటు ఉండదు. అయితే చేయడానికి మరో వ్యాపారం సానుకూలంగా కనిపించకపోవడంతో ఈసారి అనేకమంది మద్యం షాపులకు దరఖాస్తులు వేస్తున్నారు. లక్కీడ్రాలో షాపులు కేటాయింపు విధానం ఉంది కాబట్టి ఎన్ని అప్లికేషన్లు వేస్తే షాపు దక్కుతుందో తెలియక ఒక్కో వ్యాపారస్తుడు తనకు కావాల్సిన ప్రాంతంలో షాపు కోసం కనీసం 50 దాటి అప్లికేషన్లు వేయడానికి సిద్ధపడుతున్నారు. గడిచిన ప్రభుత్వ హయాంలో మద్యం గవర్నమెంటే నిర్వహించడంతో తెలంగాణ, ఒడిశా వెళ్లిపోయిన జిల్లా వ్యాపారులు అక్కడ కూడా ప్రస్తుతం అమలు కాబోతున్న పాలసీయే ఉన్నందున 75 అప్లికేషన్లు వేస్తే ఒక్క షాపు దక్కడం గగనమైపోయింది. అయితే హైదరాబాద్ సిటీ కాబట్టి ఒక్క షాపు వచ్చినా ఎక్కువ సేల్ ఉండటంతో నష్టపోకుండా బతికిపోయారు. అక్కడితో పోల్చి చూస్తే ఇక్కడ ఆ స్థాయిలో వ్యాపారం జరగదు. షాపునకు లైసెన్స్ అంటూ వస్తే పక్కనే మాల్ పెట్టుకోడానికి కూడా ఈసారి ప్రభుత్వం అవకాశమిస్తుంది. రూ.5లక్షలు అదనంగా చెల్లిస్తే కాస్ట్లీ బ్రాండ్ మద్యం అమ్ముకోడానికి అవకాశం కల్పిస్తుంది. అయితే ఇది కేవలం పార్శిల్ మాత్రమే. దీని మీద సొమ్ములు చేసుకోవచ్చన్న భావనతో వ్యాపారులు ఉన్నారు.

## తోటపాలెంలో 2వేల మందికి అన్నదానం

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

తోటపాలెంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం నిమజ్జనం అనంతరం సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో 2వేల మంది వరకు భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావనతో మానసిక శక్తి సిద్ధించడంతో పాటు సేవా దృక్పథం అలవడుతుందన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నదానం చేయడం ద్వారా ఆకలి తీర్చుకున్న భక్తులు ఎంతో సంతృప్తి చెందుతారని తెలిపారు.



## తమ్మినేనితో కృష్ణదాస్ భేటీ

(సత్యంన్యూస్, ఆమదాలవలస)



శ్రీకాకుళం పార్లమెంటరీ పరిశీలకులుగా మాజీస్పీకర్, సీనియర్ నాయకులు తమ్మినేని సీతారాంను పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం తమ్మినేని నివాసంలో కృష్ణదాస్ కలిసి అభినందనలు తెలిపారు. రానున్న నాలుగున్నరేళ్లలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా సమష్టిగా పని చేద్దామని కృష్ణదాస్ కోరారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లో ఎండగడుతూ పార్టీ ప్రజా పక్షంగా ఉండేలా పోరాటాలు కొనసాగిద్దామని తమ్మినేని స్పష్టం చేశారు. శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ తరపున తమ్మినేని సేవలు చరిత్ర సృష్టించటం ఖాయమన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు కరిమి రాజేశ్వరరావు నరసన్నపేట ఎంపీపీ అరంగి మురళి, నరసన్నపేట మండల పార్టీ అధ్యక్షులు లుకలాపు రవి, పొందర కుల అధ్యక్షులు ఆర్.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సామూహిక రాయబారం




( సత్యంన్యూస్,శ్రీకాకుళం)

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్‌తో సామూహిక రాయబారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు,బి.హరీష్ మాట్లాడు తూ నూతన విద్యా విధానం పేరుతో విద్యావ్యవస్థను ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిందని విమర్శించారు. డిగ్రీ విద్యావ్యవస్థలో మార్పులు చేసినా ఏమాత్రం మెరుగుపడలేదన్నారు. డిగ్రీ విధానంలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు రూ. 3480 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ మొత్తం కాలేజ్ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్లో నిత్యవసర సరుకులు ధరలకనుగుణంగా మెస్ చార్జీలు రూ.3వేలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడం ఆపాలన్నారు. యూనివర్సిటీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపక పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం సంతోష్, గర్ల్స్ కన్వీనర్ పవిత్ర, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రాజు, ఈ దుర్గాప్రసాద్, కుసుమ, దియాలు పాల్గొన్నారు.




## రిమ్స్‌లో ఆరోగ్య శిబిరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తు న్నారు. దీనిలో భాగంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే గొండు శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావులు ప్రారంభించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆయుష్మాన్‌భారత్ హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ డాక్టర్ కళ్యాణబాబు, రిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్, కమీషనర్ ప్రసాద్, మున్సిపల్ హెల్త్ అధికారి సుధీర్, గొలివి కరుణాకర్, గుజ్జల రాజు వెంకట్, పేడాడ సూర్యకుమారి, చింతపల్లి దుర్గారావు గాందీలు పాల్గొన్నారు.




## జెవై యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

(సత్యంన్యూస్,టెక్కలి)

ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా విద్య సంస్థలు నడిపిస్తున్న జెవై యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి డిమాండ్ చేశారు. ఆర్డీవో భరత్ నాయక్‌కు సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జేవై స్కూల్ ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా పలాస, సోంపేట, శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో కనీసం అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆటస్థలం లేకుండా కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకుండా వివిధ కోర్సుల పేర్లు చెప్పి విద్యార్థులు తల్లిదండ్రుల దగ్గర నుంచి రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు కనీసం కన్నెత్తి చూడడం లేదన్నారు. తక్షణమే జెవై స్కూల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకోకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఆర్డీవోను కలిసిన వారిలో కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు పవన్, జస్వంత్, మనీ తదితరులు పాల్గొన్నారు



## సాగు నీరు అందించాలి




(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

నారాయణపురం కుడి కాలువ ద్వారా ఎచ్చెర్ల మండలం పరిధిలోని ఫరీదుపేట, ఇబ్రహీంబాద్, పూడివలస, సనపలవానిపేట, కుశాలపురం, తోటపాలెం, కొత్తపేట, ముద్దాడ, కొంగరాం, భగీరధ పురం, ధర్మవరం, బొంతల కోడూరు, పొన్నాడ గ్రామ ఆయకట్టుకు సాగునీరు అందించాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జెడ్పీ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు రైతులతో కలిసి వినతిపత్రం అందించారు. ఖరీఫ్‌లో ఇప్పటి వరకు శివారు ఆయకట్టుకు నీరందకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వివరించారు. జలవనరులశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసి తక్షణ చర్యలు తీసుకోవాలని సాగునీరు అందించాలని కోరారు. అంతకుముందు రైతులతో కలిసి ర్యాలీగా జెడ్పీకి చేరుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ఎం.పురం పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు సనపల నారాయణరావు, మండల పార్టీ కన్వీనర్ ముద్దాడ శంకర్, వైస్ ఎంపీపి ప్రతినిధి బెండు రామారావు, జేఏసీ కన్వీనర్ మూగి శ్రీరాములు, నాయకులు నేతింటి నీలమప్పడు, ఎంపిటీసిలు గురుగుబిల్లి నరసింహమూర్తి, సీరపు శ్రీరామూర్తి, మాడుగుల జగదీశ్, సర్పంచ్‌లు పంచిరెడ్డి రాంబాబు, కారి తాతారావు, సర్పంచ్ ప్రతినిధులు దుంప చిన్నారెడ్డి, గుండరవి, మాజీ ఎంపీటీసీ సూర అప్పారావు, వైకాపా సనపల సూరిబాబు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ పాత్రుని రమణ, అల్లు సూర్యనారాయణ, మార్పు అమర్నాధ్, సీపాన ఎర్రంనాయుడు, నక్క వైకుంఠరావులు పాల్గొన్నారు.

## కెమరామెన్ గుణ మృతి

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)



సుదీర్ఘకాలం పాటు ఎలక్ట్రానిక్ మీడియాలో వివిధ సంస్థల్లో కెమరామెన్‌గా విధులు నిర్వహించిన బూరగాపు గుణ సోమవారం మృతి చెందారు. పచ్చకామెర్లతో ఆరోగ్యం క్షీణించడంతో జెమ్స్‌లో చికిత్స అందించారు. పచ్చకామెర్లు కారణంగా శరీరంలోని అవయు వాలు అన్నీ డ్యామేజ్ కావడంతో సోమవారం మృతి చెందినట్టు జెమ్స్ వైద్యులు ధృవీకరించారు. జెకెసీ మీడియాలో సిటీ కేబుల్ కెమెరామెన్‌గా ఎక్కువకాలం పనిచేసిన గుణ ఆతర్వాత జీ–టీవీ, స్పందన టీవీల్లో కొంత కాలం పనిచేశారు. ప్రస్తుతం స్వతంత్ర టీవీ జిల్లా కెమరామెన్‌గా పనిచేస్తున్నారు. గుణకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. కుమారులు ఇద్దరూ పది, ఎనిమిది తరగతలు చదువుతున్నారు. గుణ మృతి పట్ల పలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు.

## 29న జిల్లా యోగాసన పోటీలు

- అధ్యక్షులు ఎమ్మెల్యే గొండు శంకర్ వెల్లడి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 29న జిల్లా యోగాసన పోటీలు ఆర్ట్స్ కాలేజ్‌లో జరగనున్నట్లు నేషనల్ యోగసన స్పోర్ట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి యోగా అవసరమన్నారు. యోగా కోసం ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూస్తుందని తెలిపారు. పోటీలో పాల్గొనేందుకు ఆసక్తికలిగిన వారు 9676472733, 9492266889, 94911 54156 నెంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో జనరల్ సెక్రటరీ కేదార్నాథ్, జాయింట్ సెక్రటరీలు గొండ్యాల అర్చన, గురుగుబెల్లి జీవిత, ఉపాధ్యక్షులు కొంక్యాన మురళీధర్‌రావు, కోశాధికారి తంగి స్వాతి, సభ్యులు రమ్య, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.